నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 13 జూన్ 2024 | www.navatelangana.com

పిడుగుపాటుకు 41 గొర్రెలు మృతి

నవతెలంగాణ-రామాయంపేట



పిడుగుపాటుకు 41 గొర్రెలు మృతి చెందిన సంఘటన రామాయంపేట శివారులో జరిగింది. బుధవారం సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో పట్టణ శివారులోని వెంకన్న గారి చెరువు సమీపంలో పిడుగు పడి గాయంతి కనక రాజు చెందిన 13, గాయంతి మహేష్‌కు చెందిన 14 గాయింతి మల్లయ్యకు చెందిన 14, మొత్తం 41 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానిక తహసీల్దార్ రజిని ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. స్థానిక కౌన్సిలర్ దేమె యాదగిరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్ గౌడ్‌లు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నష్టపోయిన వారికి తగు పరిహారం అందించాలని వారు కోరారు.

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలి

నవతెలంగాణ-సిద్దిపేట



నీట్ పరీక్ష కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నీట్ పరీక్ష అవకతవకలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం 2024 సంవత్సరం నీట్ పరీక్ష నిర్వహించిన విధానంలోనూ, పరీక్ష ఫలితాలను వెల్లడించిన విధానంలోనూ అనేక అవకతవకలు జరిగాయని, వాటిపైన వెంటనే కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్, నాయకులు మిట్టపల్లి నవీన్, రంజిత్, యాశీన్ తదితరులు పాల్గొన్నారు. ....

మండల పంచాయతీ అధికారి సస్పెండ్

నవతెలంగాణ-జోగిపేట



మండల పంచాయతి అధికారి డి.సౌజన్యను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆమె పైన పలు ఆరోపణలు రావడంతో నారాయణఖేడ్ డీఎల్‌పీఓ సంజీవరావు విచారణ చేపట్టారు. మండల పంచాయతీ అధికారులను వేధించడంతో వారు కలెక్టర్ కార్యాలయంలో ఆమె పైన ఫిర్యాదు చేశారు. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాలతో ఆమెను సస్పెండ్ చేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

నవతెలంగాణ-జోగిపేట

పత్తి విత్తనాలు నాటడానికి వెళ్లిన ఓ మహిళ.. పిడుగు పాటుకు గురై మృతి చెందింది. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అందోలు అంజమ్మ(55) బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి తమ సొంత పొలంలో పత్తి విత్తనాలు వేయడానికి వెళ్లింది. సాయంత్రం సమయంలో పెద్ద ఎత్తున ఉరుములతో కూడిన వర్షం కురుస్తూ.. వారికి సమీపంలోనే పిడుగు పడింది. దాంతో అంజమ్మతో పాటు ఆమె కొడుకు సాయిలు, కోడలు పూజిత, అల్లుడు అందరూ ఒక్కసారిగా సొమ్మసిల్లి నేలపై పడిపోయారు. కొద్ది సేపటి అందరూ తేరుకున్నప్పటికీ.. అంజమ్మ మాత్రం కదలకుండా ఉండిపోయింది. దాంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈ సంఘటపై పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన విద్య బోధనా ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు ఉచిత విద్యా, పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. మధ్యాహ్నం భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నదన్నారు. కాబట్టి బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీటీసీలు, మండల విద్యాధికారి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తాజా మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-మద్దూరు

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మద్దూరు ఏఎస్ఐ జగదీష్, తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా. బీబీనగర్‌కు చెందిన మంజరి నరేష్, అనే వ్యక్తి బైక్‌పై అక్కన్నపేట, మండలం రామారం, గ్రామానికి వెళ్లి బీబీనగర్‌కు తిరిగి వస్తున్న క్రమంలో బెక్కల్ గుట్ట వద్ద జనగామ డిపోకు చెందిన ఏపీ 36 జెడ్0219 నెంబర్ గల బస్సు నరేష్, ఢీకొట్టడంతో కాలు విరిగింది. అతన్ని వెంటనే సిద్దిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నరేష్ భార్య అంజలి. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

నవతెలంగాణ-కొమురవెల్లి



పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందిన ఘటన కొమురవెల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడి గ్రామానికి చెందిన పుట్టరాజు పాడి గేదె మృతి చెందింది. సుమారు రూ 80వేల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకో వాలని గ్రామస్తులు కోరారు


బాలకార్మికులు లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషిచేద్దాం



నవతెలంగాణ-గజ్వేల్

బాలకార్మికులు లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మెన్ బి. ప్రియాంక అన్నారు. గజ్వేల్ కోర్ట్ ఆవరణంలో బుధవారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంలో వారు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి స్థిరమైన, దీర్ఘకాలిక కృషి ఎంతో అవసరమని, అందుకు బాలకార్మికులు లేని సమాజాన్ని నిర్మించేందుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ) 2002 నుంచి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ప్రతి సంవత్సరం జూన్ 12న 'ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం' జరపాలని నిర్ణయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమ అనంతరం బాలకర్మిక వ్యతిరేక వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు హరికష్ణ, నాగిరెడ్డి, న్యాయవాదులు,జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, యామిని కోర్ట్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తకు నివాళులు



నవతెలంగాణ-బెజ్జంకి : మండల పరిధిలోని గూడెం గ్రామ ఆశా కార్యకర్త తాడూరి విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. బుధవారం బెజ్జంకి ఆరోగ్య కేంద్రం పరిధిలోని అయా గ్రామాల ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతురాలు విజయలక్ష్మి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట

- ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ-రాయికోడ్

రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు సైన్స్ అండ్ టెక్నా లజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాటలో మంత్రి పాల్గొన్నారు. పాఠశాలల పున:ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం చదువుల తల్లి సరస్వతి దేవి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూల మాలలు సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యా రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. ప్రయివేటకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతు న్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నమన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహిం చాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల నాది అనే భావ నతో ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాల న్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను అందించారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు అప్పగించిందన్నారు. ఇప్ప టివరకు రూ.29 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస తులు, అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను దాదాపు 756 పాఠశాలలో పూర్తి చేశామన్నారరు. ఉపాధ్యాయులు ఇంటిం టికి తిరిగి బడీడు పిల్లలను, బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. పిల్లలకు అన్నిటికంటే ముఖ్య మైనది చదువేనని.. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహి ంచవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున పాటిల్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎంపీపీ సిర్గపురం మొగు లప్ప, వైస్ ఎంపీపీ మమత అశోక్, వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రె స్ అధ్యక్షులు అంజయ్య పార్టీ అధ్యక్షులు నరసింహులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యేసయ్య, మాజీ డీసీఎంఎస్ సిద్ధాన్న పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్య సేవలకే సర్కారు దవాఖానా

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

పేదోళ్ల సౌలతుకోసమే సర్కారు దావఖానాలు ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బుధవారం సిద్దిపేట సర్వజన ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులను వారి బంధువులను ఆత్మీయంగా పలకరిస్తూ, హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎమ్ఓ, ఇతర వైద్యులు, సిబ్బందితో కలసి అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వివిధ వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. వైద్యులతో, పేషంట్లతో, వారి బంధువులతో ముచ్చటించారు. గర్భిణులతో మాట్లాడి, వారికి సరైన వైద్యపరీక్షలు అందుతున్నాయా, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారా అని కనుక్కున్నారు. ఇన్ పేషంట్లకు, డెలివరీ అయిన మహిళలకు డైట్ మెనూ సరిగ్గా అందుతున్నదా, అటెండెంట్లకు కూడా భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. పౌష్టిక భోజనం, పాలు, గుడ్లను అందించాలని, రోగులకు అందించే భోజనంపై నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూపరింటెండెంట్‌ను కోరారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని, ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్యులు పేషంట్లకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని సందర్శించి పేషంట్లకు మందులు సరిగ్గా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీ ఉంది కాబట్టి మరింత మెరుగైన వైద్యం 24 గంటలు అందుతుందన్నారు. ఎమర్జెన్సీ సేవలను మరింత పటిష్టపరచాలని సూచించారు. అదేవిధంగా మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు, డాక్టర్లు, అధ్యాపకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెస్టులు, మందుల వివరాలను ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వైద్యులను, సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, సాయిరాం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణుల సంబురాలు

నవతెలంగాణ-జహీరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీఅధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం రోజున ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ టీడీపీ శ్రేణులు బాణసంచాలు పేలుస్తూ సంబురాలు జరిపారు. చంద్రన్న రాజ్యం తిరిగి రావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల కలలకు సాకారం చేకూర్చినట్టు జరిగిందన్నారు. పట్టణ ప్రధాన చౌరస్తాలో టపాసులు కాల్చి మిఠాయిలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ త్రీ మెన్ కమిటీ సభ్యులు టీ.సురేష్, మాజీ కౌన్సిలర్లు బండమీది శ్రీనివాస్, డి కె వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు అంజయ్య, చెంగల్ జైపాల్, అల్లాడి శంకర్, సయ్యద్ జమీర్, శివన్న, విఠల్, నాగన్న, సామెల్, విశాల్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- కాంట్రాక్ట్ వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలి
- మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భూపాల్ హాజరై మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వివరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం సరిగా పనిచేయకపోవడంతో అనేకమంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ మాత్రం ఇప్పటి వరకు స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, వానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా సమస్యలతో బాధపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నా రన్నారు.అన్ని హాస్పిటల్స్‌లో ప్రభుత్వం నిర్ణయించిన రూ. 15,600, కార్మికుడికి రూ.12,093 చెల్లించి మిగిలినవి పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై, రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500, రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నా రన్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ను పర్మినెంట్ చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వాటాలు ప్రతినెలా కార్మికుల జీతాల్లో జమ చేయాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. 50 ఏండ్లు వయస్సు దాటిందని తొలగించడం ఆపాలని కోరారు. రెస్ట్ రూమ్లు లేకపోవ డంతో భోజనాలు వరండాలు, వార్డులు, చెట్ల క్రింద చేస్తున్నారన్నారు. ప్రత్యేకంగా రెస్ట్ రూమ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఐడి కార్డు, యూనిఫాం, బ్లౌజులు, షూస్, ఇతర పరికరాలు సరిపడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాట నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, యూనియన్ నాయకులు యాదగిరి, రాజు, శోభ, మరియమ్మ, రమాదేవి, అలీమా, రత్నయ్య, సునీత, అనిత, నిఖిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఐటీయూ

- లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి
- హింజాల్ పరిశ్రమ కార్మికుల జనరల్ బాడీలో సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మలేష్



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల కోసం సీఐటీయూ నిరంతరం పనిచేస్తోందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీరం మలేష్ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని హింజెల్ పరిశ్రమ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ.. కార్మికుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని కార్మికుల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికల సమస్యల పైన దృష్టి పెట్టి కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మోడీకి ఎదురు దెబ్బ తగిలిందని, ఇప్పటికైనా మోడీ బుద్ధి తెచ్చుకొని ప్రజాహిత పాలన చేయాలన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, యూనియన్ నాయకులు రోషన్, మల్లేష్,చారి పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

కిష్టారెడ్డిపేటలో ఈఓ సందిల బలరాం

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-అమీన్‌పూర్



వర్షాకాలం నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కిష్టారెడ్డిపేట్ పంచాయతీ కార్యదర్శి సందిల బలరాం కోరారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం శానిటైజేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీలను క్లీన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్త ంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా లక్షణాలు ఉంటే పరీక్షలు చేసి సమీపంలోని ఏరియా ఆసుపత్రిలో అవసరమైన చికిత్సలు చేయించాలని సూచించారు. దోమలు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గ్రామాల్లో మురికి నీటి కాలువల్లో పూడిక ఉంటే తక్షణమే తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి ట్యాంకుల పైప్‌లైన్‌లు లికేజీలు ఉంటే సత్వరమే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కాచి చల్లార్చిన నీటిని ప్రజలు తాగాలని, గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా రోడ్లు ధ్వంసం

- గ్యాస్ పైప్‌లైన్ పేరుతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- వెంటనే చర్యలు తీసుకోవాలి
- బొల్లారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



అనుమతులు లేకుండానే గ్యాస్ పైప్‌లైన్ పేరిట రోడ్లు ధ్వంసం చేస్తున్నారని.. వెంటనే సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బొల్లారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులగూర్ల జైపాల్ రెడ్డి ఆరోపించారు. రోడ్లు తవ్వేసిన ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిజాంపేటకు సంబంధించిన గ్యాస్ పైప్‌లైన్ వారు రోడ్లన్నీ ధ్వంసం చేస్తున్నారని.. అయినప్పటికీ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆ కాంట్రాక్టర్లతో బొల్లారం మున్సిపల్ అధికారులకు కుమ్మక్కై పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికే మిషన్ భగీరథ పేరుతో రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని.. ఇప్పుడు నిజాంపేట నగరపాలక సంస్థకు చెందిన పైప్‌లైన్ వారు రోడ్లు ధ్వంసం చేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్యాస్ పైప్‌లైన్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని భారీ జరిమానా విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వారాల వెంకటయ్య, బషీర్, రాజగోపాల్ తదితరులున్నారు.

అమర్‌నాథ్‌కు సరుకులు తీసుకెళ్లే వాహనాలకు పూజలు

లారీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిద్దిపేట



అమర్‌నాథ్ యాత్రకు వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు సిద్దిపేట నుంచి అమర్‌నాథ్‌కు సరుకులను తీసుకెళ్లే లారీకి బుధవారం శరభేశ్వర ఆలయంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు వాహన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావులు అమర్ నాథ్‌కు సరుకులు తీసుకెళ్లే లారీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం కార్యక్రమానికి మొదట హాజరైన ఎంపీ రఘునందన్ రావు అక్కడే కూర్చోని కల్యాణం తిలకిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే హరీశ్ రావు వచ్చారు. ఇద్దరు ఒకరికి ఒకరు పలకరించుకొని కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు కొర్తివాడ లక్ష్మణ్, ప్రతినిధులు ఉప్పల భూపతి, మధుసూదన్, పరమేశ్వర్, రమేష్, తమ్మిశెట్టి వీరేశం, బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇంచార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు ఉచితంగా యూనిఫామ్ పాఠ్య పుస్తకాలు భోజనం అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, మంజుల ప్రమోద్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్,మహదేవ్ రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి,చంద్ర శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్‌లో భారీ వర్షం..



నవతెలంగాణ-పుల్కల్

ఉమ్మడి మండల పరిధిలోని చాలా గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలను విత్తుకున్నారు. అయితే గత వారం రోజులుగా భారీ ఎత్తున వర్షాలు పడుతుండడంతో.. రైతులు ఆందోళన పడుతున్నారు. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి వ్యాపారుల వద్ద రుణాలు తెచ్చి సాగు చేశామని.. కానీ ఈ ఎడతెరిపి లేని వర్షాలతో నాటుకున్న విత్తనాలు, అక్కడక్కడా మొలకెత్తిన మొక్కలు కూడా మురిగిపోయే ప్రమాదమున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి.. రైతులకు తగిన సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నారు.



వివాహ విందుకు హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావు

నవతెలంగాణ-జహీరాబాద్

పట్టణంలోని పీవీఆర్ గార్డెన్స్‌లో జరిగిన వివాహ విందులో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రామకృష్ణ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ తంజీమ్, పార్టీ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, పిచ్చేరాగాడి మాజీ సర్పంచ్ జె.రవికిరణ్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్మెంట్ తీసుకున్నా.. విద్యార్థులకు పాఠాలు

నవతెలంగాణ-సదాశివపేట

మండల విద్యాధికారిగా రిటైర్మెంట్ అయినప్పటికీ.. చదువు మీద ఉన్న గౌరవంతో విద్యార్థులకు పాఠాలు బోధించి విశ్రాంత మండల విద్యాధికారి డి.అంజయ్య ఆదర్శంగా నిలిచారు. సదాశివపేట, పుల్కల్, చౌటకూర్ మండలాల్లో పనిచేసిన మండల విద్యాధికారి పని చేసిన ఆయన గత మే 31న రిటైర్డ్ అయ్యారు. అయినప్పటికీ పిల్లలకు పాఠాలు చెప్పాలన్నా ఆసక్తితో.. బుధవారం విద్యా సంవత్సరం మొదటి రోజు పాఠశాలలు ప్రారంభం కాగా సదాశివపేటలోని ప్రభుత్వ రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గణితం, తెలుగు, నైతిక విలువలు బోధించారు. సమయం దొరికినప్పుడల్లా విద్యార్థులకు చదువు చెప్తానని ఆయన తెలపడం విశేషం. విద్యార్థులకు బోధించడం తనకు చాలా ఆనందాన్ని ఇస్తున్నదని చెబుతున్నారు. యువకులకు రక్తదానం చేయడం కోసం, బాల కార్మికులను బడిబాట పట్టించడానికి తన శక్తి మేరకు పనిచేస్తానని తెలిపారు. సంగారెడ్డి బ్రహ్మకుమారిస్ సిస్టర్ బికె అన్నపూర్ణ విద్యార్థులకు 'నైతిక విలువలు విద్యా విలువలు' బోధించారు. ఆహారాన్ని ఇతరులకు పంచడం, నీటిని ఆదా చేయడం, విద్యుత్తును ఆదా చేయడం విద్యార్థులకు నేర్పించారు.



నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవు

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఫర్టిలైజర్ దుకాణ యజమానులు నిబంధనలు పాటించకుంటే వారిపై చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లావణ్య హెచ్చరించారు. న్యాల్‌కల్, డప్పురు ఫర్టిలైజర్ షాపుల్లో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలన్నారు. అలాగే స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రాసి ఉంచాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించొద్దన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమన్న రైతులకు న్యాల్‌కల్ డీసీఎంఎస్ కేంద్రంలో డీఏపీ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు సాయిలు.. సిబ్బందితో కలిసి విద్యార్థులకు పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫామ్ దుస్తులను అందించారు. ఈ కార్యక్రమాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మెన్‌లు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రభుత్వమే బొంగులు ఉచితంగా సరఫరా చేసి మెదర కుల వృత్తి దారులకు ఆదరణ కల్పించాలని మహేంద్ర సంఘం వెదురు బొంగు, సర్వు కట్టెల దుకాణ దారుల సంఘం అధ్యక్షుడు జోగ్రీగల లోకదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ శివారులో గల రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన పటాన్‌చెరు ప్రాంత మేదరి మహేంద్ర సంఘం వెదురు బొంగు మరియు సర్వు కట్టెల దుకాణదారుల సంఘం ఆత్మీయ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకదాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేదర బొంగు వ్యాపారులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత బొంగులు సరఫరా చేసి మెదర కులవృత్తిదారులకు ఆదరణ కల్పించాలన్నారు. మేదర యువతకు సబ్సిడీ రుణాలు, మేదరి వృత్తి కళాకారులకు పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న సంఘం ప్రతినిధులకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వెదురు పారిశ్రామిక సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీనివాస్,మహేంద్ర సంఘం రాష్ట్ర కోశాధికారి ఉమా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్, మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు అంబాదస్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

- డాక్టర్ల గైర్హాజర్‌పై ఆగ్రహం
- విధుల్లో లేని, అనధికారికంగా సెలవు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌కు విజ్ఞప్తి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేసి.. ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు. జిల్లా డీసిహెచ్ఎస్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యుల హాజరు పట్టికను పరిశీలించారు. ఎమ్మెల్యే విజిటింగ్ చేసిన సమయంలో ఆస్పత్రిలో పలువురు డాక్టర్లు గైర్హాజరు, సెలవులపై ఉన్నట్లు తెలుసుకొని అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీ టైంలో విధుల్లో లేని వారితో పాటు అనధికారికంగా లీవ్ పెట్టిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో ఉన్న ఐసీయూ సెంటర్‌ను, డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి రోగులతో మాట్లాడి వారికీ అందిస్తున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తీరుపై అసహనం వ్యక్తం చేసారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, 24 గంటలు డ్యూటీ డాక్టర్స్ అందుబాటులో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డయాలసిస్ సెంటర్‌లో ఐదు డయాలసిస్ యూనిట్లు మంజూరైనప్పటికీ నేటికీ వాటిని వినియోగంలోకి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నుంచి మంజూరు పత్రాలు వచ్చాయి కానీ.. పరికరాలు రానందున ప్రారంభించలేకపోయామని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఎంసీపే భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని డీసిహెచ్ఎస్‌కు ఆదేశించారు. ఐసీయూలో గత నాలుగు నెలల నుంచి అందించాల్సిన ఎమర్జెన్సీ సేవలు అందించకపోవడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. యంత్రాలు పని చేయకపోతే వాటి వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి లేదా తన దృష్టికి తీసుకువస్తే వాటిని నూతనంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే వైద్యశాలకు సంబంధించిన పలు విషయాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. డిప్టేషన్‌పై వెళ్లిన 30 మంది వైద్యుల డిప్యూటేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌కు, డిసిహెచ్ఎస్‌కు విజ్ఞప్తి చేశారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడంతో.. రోగులు కర్ణాటక రాష్ట్రానికి వెళుతున్నారని ఇది మంచి పరిణామం కాదన్నారు. సాధ్యమైనంత వరకు మెరుగైన సేవలు ఇక్కడే అందించాలని ఆదేశించారు. వైద్యశాలలో ఉన్న స్కానింగ్ సెంటర్, ఎక్రే బేబీ కేర్ యూనిట్‌ను 24 గంటల పాటు సేవలందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మెన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మెన్ విజయ్ కుమార్, పార్టీ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండలాధ్యక్షులు వెంకటేశం, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు చందు, తాంజిమ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్,గోపాల్, మాజీ సర్పంచ్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కోర్టు..

నవతెలంగాణ-రామచంద్రాపురం

దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయనున్నట్టు రామచంద్రాపురం విద్యుత్ శాఖ ఏఈ సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం జూన్ 14 రోజున ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని సబ్ స్టేషన్ కార్యాలయంలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కావున ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకొని విద్యుత్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

15 తేదీన సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఈనెల 15వ తారీఖున న్యాల్‌కల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు విధిగా తమ పూర్తి వివరాలతో సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

పాఠశాలలు పున:ప్రారంభమైన మొదటిరోజే రేజింతల్, మిర్జాపూర్(బి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు వెంకటేశం, గురునాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలన్నారు. మెరుగైన విద్యాబోధన కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించి ందన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నదన్నారు. కాబట్టి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో రేజింతల్ ఎంపీటీసీ నల్లవల్లి మల్లిక శ్రీనివాస రెడ్డి, గ్రామ నాయకులు జగనాథ్‌రెడ్డి, మైముద్ అలీ, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చైర్మెన్ రామేశ్వరి, పంచాయతీ సెక్రెటరీ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు..
ప్రయివేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్స్ ఇవ్వాలి

- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో డీఈఓ సూపరింటెండెంట్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అడ్మిషన్స్ నిరాకరిస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అలాగే అలాంటి విద్యార్థులకు ప్రయివేటు విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ఇవ్వాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఎన్పీఆర్డీ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు వైకల్యం కారణం చూపుతూ అడ్మిషన్స్ నిరాకరిస్తున్న ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాల్కల్ మండలం హద్నూరా గ్రామానికి చెందిన ఎంఆర్ కార్తిక్ అనే విద్యార్థి ప్రత్యేక అవసరాలు కలిగి ఉండి జహీరాబాద్ పట్టణంలోని మంటేస్సరీ హైస్కూల్‌లో చదువుతున్నాడ న్నారు. అయితే ప్రస్తుత విద్య సంవత్సరం నుంచి ఆయనకు అడ్మిషన్ ఇవ్వాలేమని పాఠశాల యాజమాన్యం చెప్పడం సరైంది కాదన్నారు. ఇదేంటని విద్యార్థి తల్లిదండ్రులు యాజమాన్యాన్ని అడిగితే.. వికలాంగులకు చదువు చెప్పడం సాధ్యం కాదు. మీరు ఇంకా ఎక్కడ అయినా వేరే పాఠశాలలో చేర్పించండి అని చెప్పారని.. ఇది దుర్మార్గమన్నారు. జహీరాబాద్ పట్టణంలోని మంటేసోరి హై స్కూల్, నారాయణ హై స్కూల్, సంగారెడ్డి పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ హై స్కూల్లో అడ్మిషన్స్ కోసం వెళ్తితే అడ్మిషన్ నిరాకరించారన్నారు. 2016వికలాంగుల హక్కుల పరి రక్షణ చట్టం, 2009 విద్య హక్కు చట్టాలకు భిన్నంగా ప్రయి వేట్ పాఠశాలల యాజమాన్యలు వ్యవహరిస్తున్నాయన్నారు. 2016 ఆర్ పి డబ్ల్యు డి చట్టం సెక్షన్ 16ప్రకారం ప్రభుత్వం అనుమతి పొందిన ప్రయివేట్ విద్య సంస్థలు వైకల్యం కలిగిన విద్యార్థులకు అడ్మిషన్స్ ఇవ్వాలన్నారు. 2016 ఆర్పీ డబ్ల్యూడీ సెక్షన్ 16(1), (2)ప్రకారం ఎలాంటి వివక్షత చూపకుండా ప్రభుత్వ మరియు ప్రయివేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఇచ్చి ఇతర విద్యార్థులతో సమానంగా విద్య అవకాశాలు కల్పించాలన్నారు. భవనలు, అవరణ, ఇతర సౌకర్యాలు వికలాంగులకు అందుబాటులో ఉంచాలన్నారు. 2016 ఆర్పీడబ్ల్యూడీ సెక్షన్ 17(బి), (డి)ప్రకారం స్పెషల్ ఎడ్యుకే షన్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రత్యేక అవస రాలు కలిగిన విద్యార్థులకు చదువు నేర్పేందుకు ట్రైనింగ్ చేసిన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సెక్షన్ 18 ప్రకారం సకలాంగులు అయిన విద్యార్థులతో సమానంగా వారిని చూడాలన్నారు. వైకల్యం కలిగిన విద్యార్థులు 2016 ఆర్పి డబ్ల్యుడి చట్టం సెక్షన్ 3(1) ప్రకారం తమ హక్కులు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్షన్ 3(4)వైకల్యం కారణం చూపుతూ వ్యక్తిగత స్వేచ్చను హరించ కూడదని చట్టంలో ఉన్నప్పటికీ.. ఎక్కడ కూడా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా అడ్మిషన్స్ నిరకరించడం సరికాదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఇప్పించాల న్నారు. అడ్మిషన్లు నిరాకరించిన ప్రయివేట్ పాఠశాలల గుర్తిం పు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఉద్య మం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.మాణిక్, సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనూ 'కార్పొరేట్ స్థాయి విద్య'

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాబోధన కొనసాగుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని.. విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్) పాఠ్యపుస్తకాలు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాబోధన కొనసాగుతోందన్నారు. అందుకు అనుగుణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మం డల విద్యాశాఖ అధికారి పిపి రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయకుమార్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని నెంబర్-3 పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్), పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంద న్నారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాబోధన కొనసాగుతోందన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బస్వరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గుండప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు ముత్యాల చందు, తాంజిమ్, హీరు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేగావ్ మాజీ సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని గరిడేగావ్ గ్రామ మాజీ సర్పంచ్ పిరప్పా ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి పరావర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యాన్ని అందించారు. అలాగే సిర్గాపూర్ మండలంలోని కడ్పల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హైమద్‌సాబ్ మృతిచెందిన విషయం తెలుసుకొని.. వారి ఇంటికెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని అందించారు. నిజాంపేట మండలంలోని బాచేపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల అంజిరెడ్డి ఇటీవల మరణించగా.. వారి ఇంటికి వెళ్లి మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు సంజీవ రావు పాటిల్, మాజీ ఉపసర్పంచ్ రాజేందర్‌పాటిల్, ఎంపీ టీసీలు జక్కుల రమేష్, ఎంపీటీసీ అంజయ్య సాగర్, కో ఆప్షన్ సభ్యులు బషీర్, మాజీ సర్పంచ్ భూమ్‌రెడ్డి, రామచందర్ పాటిల్, యాదవరావు పాటిల్, నాయకులు మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, సంగమేశ్వర్, నాగరాజు, కుమ్మరి అంజయ్య, కొండే హన్మాండ్లు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ముందుండాలి



నవతెలంగాణ-రామచంద్రాపురం

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అన్ని శాఖల అధికారులు ముందుండాలని భారతినగర్ కార్పొరేటర్ సింధూ అన్నారు. భారతినగర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఎంఐజి కాలనీకి సంబంధించిన ఇంజనీరింగ్, జలమండలి అధికారులు, సొసైటీ సభ్యులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎంఐజి కాలనీలో మంజూరైన రోడ్లు, మిగిలిన అండర్ గ్రౌండ్ డ్రేనేజ్ మరియు సీసీరోడ్లను ప్రాధాన్యత బట్టి త్వరగా వేయాలని కోరారు. వర్షాకాలం ఉన్నందున మాన్సూన్, ఎంతమోలజీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి.. ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలని కోరారు. రైల్వేట్రాక్‌రోడ్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని.. జిహెచ్ఎంసి మరియు సొసైటీ సభ్యుల సమన్వయంతో స్పీడ్ బ్రేకర్లు వేయాలని నిర్ణయించారు. తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్‌తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంజనీరింగ్ ఏ.ఈ రమేష్, జలమండలి ఏ.ఈ సుబ్రమణ్యం,వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ మరియు ఎంఐజి కాలనీ ప్రెసిడెంట్ వెంకట్‌రావు, డైరెక్టర్లు సుబ్బారావు, నారాయణ గౌడ్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత 8వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో దుర్గామాత 8వ వార్షికోత్సవ ఉత్సవాలను మాజీ సర్పంచ్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఓడిబియ్యం, నూతన వస్త్రాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా పెంచాలి

- విద్యుత్ కోతలపై అధికారులు అప్రమత్తం కావాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కే.దేవదాస్

నవతెలంగాణ-ఝరాసంగం



ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో మురికి కాలువలు నిండిపోయి రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని.. అందుకు అధికారులు అప్రమత్తమై పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ కే.దేవదాస్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గల సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో సుధాకర్ బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో తరచుగా కరెంటు పోతుందని ఇలా కరెంటు కోతలు విధించడం వల్ల తమ ప్రభుత్వం పై నిందలు వస్తున్నాయని.. గతంలో మిషన్ భగీరథ కింద గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేసిన వారికి డబ్బులు చెల్లించడానికి ప్రభుత్వం ఏడు లక్షల రూపాయలు మంజూరు చేస్తే ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 3.50 లక్షలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 80 వేలతో సరిపెట్టి మిగిలిన డబ్బులను ఇవ్వకపోవడం సమంజసం కాదని ఆ శాఖ అధికారిపై ఎంపీపీ మండిపడ్డారు. జీర్లపల్లి, బర్దిపూర్, పోట్టిపల్లి, మేదపల్లి గ్రామాల్లో ఉన్న చెరువులకు మరమ్మతులు చేయాలని.. ఎంపీటీసీలు శంకర్ పాటిల్, రాజు సభ దృష్టికి తీసుకు వచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి ప్రత్యేక భవనం లేక గత కొన్నేండ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయని.. అందుకు ప్రత్యేక భవనాన్ని నిర్మించాలని హెచ్ఓ చంద్రమ్మ సభా దృష్టికి తీసుకు వచ్చారు. అందుకు ప్రపోజల్ పంపిస్తామని ఎంపీడీవో బదులిచ్చారు. ప్రతీ గ్రామంలో ధరణి సమస్యలు పేరుకుపోయాయని వెంటనే వాటిని పరిష్కరించాలని ఎంపీటీసీ శంకర్ పాటిల్ ప్రశ్నించగా.. ధరణి పోర్టల్ రావడంతో గ్రామాల్లో ఎంక్వయిరీ చేసే అధికారం రెవెన్యూ శాఖ కోల్పోయిందని అందుకు ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలని తహసీల్దార్ సంజీవ రావు సమాధానం ఇచ్చారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 210 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వినీల, ఎంపీటీసీలు విజేందర్ రెడ్డి, సంగీత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రయినేజీ అవుట్లెట్లను శుభ్రం చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

మల్లికార్జున్‌నగర్ వద్ద ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్లను రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ బుధవారం శుభ్రం చేయించారు. రామచంద్రారెడ్డినగర్ కాలనీ, మల్లికార్జుననగర్, మయూరి నగర్ కాలనీలో వర్షం పడితే డ్రయినేజీ పైపులు నిండి రోడ్ల మీద మరియు ఇండ్లల్లోకి మురుగు నీరు చేరుతున్నదని కాలనీ వాసులు తెలుపడంతో.. కార్పొరేటర్ పుష్ప అధికారులతో కలిసి పర్యటించారు. మల్లికార్జుననగర్ కాలనీ కృష్ణుడి ఆలయం వద్ద ఉన్న మల్లికార్జుననగర్ బ్రిడ్జి కింద డ్రైనేజీ ఔట్లెట్ మొత్తం మూసుకుపోయి నీరు బయటకు రాకుండా ఉండడంతో కాలనీల లోకి నీరు రివర్స్ వస్తున్నదని గుర్తించారు. వెంటనే తన సొంత నిధులతో హిటాచి తెప్పించి బ్రిడ్జి కింద ఉన్న ఔట్లెట్ ముందు భాగంలో పేరుకుపోయిన చెత్త, మట్టిని దగ్గర ఉండి.. తొలగింపు చేసి సమస్యను పరిష్కారించారు. వారితో ఏఈ ప్రభు, అరుణ్ సింగ్, విట్టల్ రెడ్డి, శంకర్ యాదవ్, సీఎం మల్లేష్, లింగం, స్థానిక కాలనీ వాసులు, జిహెచ్ఎంసి, జలమండలి సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మృతి

నవతెలంగాణ-వెల్దుర్తి



విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రామయ్య పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి రామయ్యపల్లి గ్రామానికి చెందిన కాలేరు ఆంజనేయులు 45 సంవత్సరాలు తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న స్టార్టర్ బాక్సులకు కరెంటు సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళుతున్న క్రమంలో కాలుజారి పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లకు చేతులు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు మృతునికి తల్లి మాత్రమే ఉందన్నారు. కుటుంబ సభ్యుల మేరకు ఎస్ఐ నవత గౌడ్ కేసు నమోదు చేసుకొని, సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్ట నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నస్కల్‌లో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు నోటుబుక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం నాణ్యమైన విద్య అందివ్వడం జరుగుతుందని. తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం రెడ్డి, ఉపాధ్యాయులు దుర్గయ్య, ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, గ్రామస్తులు నాతి లక్ష్మా గౌడ్, దుబాసి సంజీవ్, నరసింహారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

నేడు నస్కల్‌లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సప్లై నిలిపివేస్తున్నట్లు నిజాంపేట ఏ ఇ గణేష్ తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కరెంటు పోల్స్ వేయడం జరుగుతుందని అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గాగిల్లపూర్, దాచారం, బేగంపేట, కల్లేపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, అందుబాటులో ఉన్న యూనిఫామ్స్‌ను పంపిణీ చేసినట్టు ఎంఈఓ పావని బుధవారం తెలిపారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ తెలిపారు. ఎంపీటీసీలు కొలిపాక రాజు, కొమిరే మల్లేశం, అయా పాఠశాలల బోధన సిబ్బంది, అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు, విద్యార్థులు హాజరయ్యారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవ తెలంగాణ-గజ్వేల్

విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో గురువారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని గజ్వేల్ విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని సాయి బాబా గుడి (లక్ష్మిప్రసన్ననగర్), వైష్ణవి గార్డెన్, పోలీసు స్టేషన్ రోడ్డు, ఆఫీసర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ ముట్రాజ్ పల్లి ఏరియాల్లో ఉదయం 6 గంటల నుంచి 8:45 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. అనంతరం ఎస్సీ కాలనీ, గజ్వేల్ శివారులో ఉన్న పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. గజ్వేల్ పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఏఈ కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-వర్గల్



మండలంలోని తునికి ఖల్సా గ్రామానికి చెందిన కొండగళ్ళ సంజీవ ఈ నెల 3 తేదిరోజున ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో మరణించారు. మృతుడి స్నేహితులు సంజీవ కుటుంబసభ్యులను పరామర్శించి, వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. వారి స్నేహితులు 50 కిలోల బియ్యం 21500 రూపాయల నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ స్నేహితులు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే సంజీవ మా నుంచి దూరం కావడం బాధాకరమన్నారు. మృతుడి కుటుంబానికి ఎల్లవేళలా తమవంతు సహాయం అందజేస్తామని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో సంజీవ స్నేహితుల బృదం పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన

నవతెలంగాణ-రాయపోల్



ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యా బోధన చేయడం జరుగుతుందని మండల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ రెడ్డి ఎంపీటీసీ సాయిోళ్ల లక్ష్మీ యాదగిరి అన్నారు. బుధవారం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు కంటే మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యను అందిస్తుందని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు ప్రతి సంవత్సరం అందిస్తుందన్నారు. విద్యార్థులందరికీ కూడా నాణ్యమైన సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందన్నారు. విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు అందుబాటులో ఉండడంతో పాటు విశాలమైన ఆటస్థలంలో శారీరకంగా దృఢంగా తయారు చేయడం కోసం వ్యాయామ ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉన్నారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇంగ్లీషు మీడియంలో బోధించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థుల్లో 100% ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ ఈ సౌకర్యాలను వినియోగించుకుని బాగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ శైలజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయుల బృందం, సిఆర్పి స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే ఆధార్ వివరాల సేకరణ

అధికారులా, సైబర్ మోసగాళ్లా తెలవడం లేదు

ఆందోళన చెందుతున్న గ్రామస్థులు

నవతెలంగాణ-నార్సింగి

ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. సామాన్య ప్రజల నుంచి మొదలుకొని పెద్ద పెద్ద పదవులలో ఉన్న నాయకులు, అధికారులు వీరి ఉచ్చులో సునాయాసంగా మోసపోతున్నారు. ప్రస్తుతం ఆధార్ నంబర్‌తో బ్యాంకు అకౌంట్లు, భూములు, గ్యాస్ కనెక్షన్లు ఇలా ఒకటేమిటి అన్నీ అనుసంధానం అయి ఉన్నాయి. ఒక్క ఆధార్ వివరాలు, అనంతరం ఒక ఓ.టీ.పీ తో ఖాతాలు ఖాళీ అయిపోతున్నాయి. దీనిపై పోలీసు శాఖ వారు ప్రజలలో చైతన్యం తేవడానికి కృషి చేస్తుంది. ఇలాంటి తరుణంలో మండల కేంద్రంలో బుధవారం ఉదయం కొంత మంది ఎలాంటి ఐడీ కార్డులు లేకుండా ఇంటింటికీ తిరుగుతూ ఆధార్ కార్డు నంబర్ అడుగుతూ కనిపించారు. 'నవతెలంగాణ' నార్సింగి ప్రతినిధి వారితో వాకబు చేయగా మిషన్ భగీరథ గురించి సర్వే చేస్తున్నామని బదులిచ్చారు. ఏ శాఖ నుంచి వచ్చారని ప్రశ్నించగా ఒక సారి గ్రామ పంచాయితీ అని, మరోసారి ఎంపిడిఓ ఆఫీస్ నుంచి వచ్చామని పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. ఈ విషయమై నార్సింగి పంచాయితీ సెక్రటరీ వెంకటేష్‌కు ఫోన్‌లో సంప్రదించగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే మిషన్ భగీరథ గురించి ఇంటింటి సర్వే చేస్తున్నామని తెలిపారు. ఆధార్ వివరాలు అడుగుతున్న విషయమై నార్సింగి ప్రత్యేక అధికారి, ఎంపీఓ నరేష్‌ను వివరణ కోరుతూ గ్రామంలో ప్రతి విషయమై చాటింపు చేసే ఆనవాయితీ ఉందని, మిషన్ భగీరథ సర్వే విషయంలో ప్రజలకు చాటింపు ద్వారానో, పత్రిక ప్రకటన ద్వారానో ఎందుకు తెలియజేయలేదని, సర్వే ఉందని తెలిస్తే ప్రజలకు వివరాలు నమోదు చేయించడంలో జంకు ఉండదని, సర్వే కోసం వచ్చిన వారి వద్ద గుర్తింపు కార్డులు లేవని, విషయాన్ని సరిగ్గా వివరంచలేక పోతున్నారని, ఒక వేళ సర్వే పేరుతో ఎవరైనా సైబర్ మోసం చేసే వారు వస్తే ఎలా అని, దానికి బాధ్యులు ఎవరని అడగ్గా ఎంపీ ఓ నరేష్ దురుసుగా జవాబిస్తూ మీకు ఇష్టం ఉంటే వివరాలు ఇవ్వండి లేక పోతే లేదని బదులిచ్చారు. ఇదే విషయాన్ని పేపర్‌లో రాసుకోండి అని, కలెక్టర్ ఆఫీస్‌లో కనుక్కోండి అని బాధ్యతారాహితంగా జవాబిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఒక పక్క ప్రజలను చైతన్య పరుస్తూ, మరో పక్క ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇంటింటికీ వచ్చి ఆధార్ నంబర్ అడగడం ఎంత వరకు సమంజసం? సర్వే విషయం ప్రజలకు ముందస్తుగా తెలియజేస్తే గందరగోళం ఉండేది కాదని, బ్రతుకు దెరువు కొరకు వేరే చోట్లకు వెళ్లిన వారు కూడా స్వంత ఊరికి వచ్చి వివరాలను నమోదు చేసుకునే వీలు ఉంటుందని ప్రజలు అంటున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన వేణు అనే వ్యక్తి (51) మంగళవారం మృతి చెందగా అతని కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు.నెల రోజుల నుంచి అతని ఆరోగ్యం బాగాలేక హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. ఆరోగ్యం క్షీణించడంతో వేణు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వేణుకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఏడు సంవత్సరాల కొడుకు తండ్రికి తలకొరివి పెట్టడంతో గ్రామ మహిళలు కంటతడి పెట్టారు.

భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలి

- పరిహారం ప్రకటించకుండానే రైతులతో సమావేశాలెందుకు
- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు

నవతెలంగాణ-నర్సాపూర్

రీజినల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పరిహారం ఎంతో ప్రకటించకుండానే రైతులతో సమావేశం నిర్వహించడం సరికాదని సీపీఐ(ఎం) నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నిర్వాసితులతో కలిసి ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చిందని, మల్లన్న సాగర్ పోరాటంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని ఉద్యమాలు చేసిన సంగతి గుర్తుచేశారు. ఆర్ఆర్ఆర్ నిర్వాసితులు భూములతో పాటు చిన్న చిన్న చిరుద్యోగులు ప్లాట్లు తీసుకున్నారని వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి, ప్లాటుకు ప్లాటు ఇవ్వాలని, నిర్వాసితుల కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో గ్రామాలలో భూమి కోల్పోతున్న నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, దుర్గేశ్, అంజయ్య, విఠల్, శివ రెడ్డి, సంఘమేశ్వర్ పాల్గొన్నారు.



మహిళల ఆర్థిక అభ్యున్నతికి పెన్నీ ఫిక్స్‌కు శ్రీకారం

- ఇంటర్ విద్యార్థిని రూపకల్పన
- డ్వాక్రా మహిళల స్థితిగతులపై డాక్యుమెంటరీ

నవతెలంగాణ-మెదక్

మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా విద్యార్థి ఆనిక వడ్లమూడి నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ మహిళల వృత్తిని, ఆర్థిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పెన్నీ, ఫిక్స్ ప్రాజెక్టును తీసుకు వచ్చింది. ఇందులో భాగంగా బుధవారం మెదక్ మండలం మాచవరం గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనిక మాట్లాడుతూ. తాను హైదరాబాద్‌లోని ఒక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసి ఇంటర్‌లో చేరినట్లు తెలిపారు. ఈ నూతన పెన్నీ, ఫిక్స్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాల మహిళల వృత్తిని, ఆర్థిక నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమేన్నారు. ఆర్థిక స్వతంత్రతను ప్రోత్సహించి ఆర్థిక విద్య అంటే ఏమిటి, తద్వారా మెరుగైన భవిష్యత్తుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు ఎలా సృష్టించుకోవాలి, ఆర్థిక సూత్రాలు, బడ్జెట్ నిర్వహణ తెలియజేస్తామని తెలిపారు. ప్రధానంగా ఆధునిక ఆర్థిక వ్యూహాలపై దృష్టి పెట్టడం మూలంగా మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలు నియంత్రించడానికి, అప్పులు తగ్గించడానికి, స్థిరమైన ఆదాయ వనరుల సృష్టికి తగిన సహాయం చేయడమేనని చెప్పారు. ఈ ప్రాజెక్టు కేవలం డబ్బులు కాకుండా అవకాశాలను కల్పించడం, మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచి శక్తివంతమైన మహిళా సమాజాన్ని పెంపొందించడం తమ లక్ష్యమని వివరించారు. ఈ ప్రాజెక్టులో మహిళకు చేతి పనులు, గృహ వ్యాపారాలు, కాటేజ్ ఇండస్ట్రీస్, లెస్ తయారి, ఎంబ్రాయిడరీ వంటి లాభదాయకమైన పనులు చేపట్టి ఉపాధి పొందడమే కాకుండా వారు ఆదాయాన్ని సైతం పెంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ బాబు, మాజీ సర్పంచ్ సాంబశివరావు, ఏపీఎం మహలక్ష్మి డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



శేరిపల్లిలోని పాఠశాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నార్సింగి





అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలు వెచ్చించి పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నా అటు జిల్లా అధికారులు ఇటు మండల అధికారులు పర్యవేక్షణలు చేస్తున్నా మండలంలోని శేరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే వేసినట్టుగా ఉన్నది. పాఠశాలలు పునః ప్రారంభమైనా పాఠశాలలో వసతులు సరిగ్గా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనికి కారణం పాలకుల లోపమా, కాంట్రాక్టర్ల లోపమా అన్న ప్రశ్న ప్రజలలో ఉత్పన్నమవుతుంది. ఇప్పటికీ పాఠశాల దుస్థితి అలానే ఉందని, అధికారులు ఇంతవరకు పాఠశాలను సందర్శించకపోవడం దురదృష్టకరం అని అంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలలను బాగు చేస్తుంటే, శేరిపల్లి పాఠశాలలో మాత్రం సుమారు 6 నెలల క్రితం నిర్మించిన మరుగుదొడ్లలో మూడు డోర్లు కింద పడిపోయి ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, ఆరు నెలల్లోనే డోర్లు ఊడి పడిపోవడంతో నిర్మాణంలో నాణ్యత ఎలా ఉందో తెలుస్తుంది అని వాపోయారు. పైపులు లీకవ్వడం లాంటి నాసిరకం పనులు చేశారని అన్నారు. మరుగు దొడ్లకు వెంటనే డోర్లు బిగించి విద్యార్థులకు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని వారు అధికారులను కోరారు. అలాగే పాఠశాల చుట్టూ ప్రహారీ గోడ నిర్మించాలని, డైనింగ్ హాల్ పూర్తి చేయాలని, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఐదు కంప్యూటర్లకు టేబుల్‌లను సమకూర్చాలని ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులను కోరారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మున్నూరుకాపు సంఘం మాజీ అధ్యక్షుడు గజవెల్లి లక్ష్మీ నర్సింలు, తాళ్ల చిన్న కృష్ణ గౌడ్, తాళ్ల వెంకట్ బాలకృష్ణ గౌడ్, పసులోటి మోతీలాల్, చెప్యాల బాబు తదితరులు పాల్గొన్నారు.

నా భూమి నాకు ఇప్పించండి

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన వినోద్ తన భూమిని తనకు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నాడు. అతనికి గ్రామ శివారులో గల 164 సర్వే నెంబర్‌లో ఎకరాల 2.22 గుంటల భూమి ఉండగా కాలేశ్వరం కాల్వ పనులలో అతని భూమి పోయింది. మిగతా భూమి చూపించడం లేదని భూమి కొరకై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా అధికారులు పట్టించుకోవడంలేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఈ సందర్భంగా బాధితుడు బుధవారం మీడియాతో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిలో ఇద్దరు అన్నదమ్ములం పంచుకోగా రెండు ఎకరాల 2.22 గుంటలలో ఇరువురికి ఎకరా భూమి వచ్చిందన్నారు. అతని అన్నయ్యకు ఎకరా భూమి ఉండగా వినోద్ భూమిలో నుంచి కాళేశ్వరం కాల్వ పనులు జరుగుతుండడంతో అతని పేరు మీద 18 గుంటల భూమి చూపించడం జరుగుతుందని, మిగతా 22 గుంటల భూమి కొరకై ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఇకనైనా అధికారులు స్పందించి అతనికి రావలసిన 22 గుంటల భూమిని చూపించాలని ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నాడు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-కోహెడ



ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను ఆమె చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే జీవన విధానాలతో పాటు, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, హెచ్ఎంలు దెవేందర్, రాళ్ళపల్లి పద్మయ్య, గ్రామస్థులు నాగలక్ష్మి, రజిత, సురంజన, రేణుక, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామాన్ని చెందిన ఉప్పరి బాల్ నరసయ్య(35) ఆరు సంవత్సరాల క్రితం సిద్దిపేట పట్టణానికి చెందిన రోజాతో వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి పనికి వెళ్లకపోవడంతో అప్పులు ఎక్కువై చిట్టీలు కట్టలేక జీవితంపై విరక్తి చెంది మనస్తాపానికి గురై సోమవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగానని తన భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి అక్కడికి చేరుకొని సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భవతి. భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

- 33 పాఠశాలలకు 2338 పంపిణీ చేసిన అధికారులు

నవతెలంగాణ-చిలిపిచెడ్



తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభించిన తొలి రోజునే విద్యార్థులకు డీఈఓ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులను అధికారులు పంపిణీ చేశారు. చిలిపిచేడ్ మండల ఏపీఎం ప్రేమలత, మండల సమైక్య అధ్యక్షురాలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఏక రూప దుస్తులు బుధవారం నాడు అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలిపిచెడ్ ఏపీఎం ప్రేమలత మాట్లాడుతూ మండలంలో 33 పాఠశాలలకు 2338 విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, సీసీలు, మండల సమైక్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్ బుజరాన్ పల్లి గ్రామాలలో ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్‌లను పాఠ్యపుస్తకాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శుద్ధ వహించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా తహశీల్దార్ గ్రేసీ బాయ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధుసూదన్ సురేందర్ రెడ్డి, నారా గౌడ్, దాచ సంగమేశ్వర్, మాజీ సర్పంచులు నాయకులు, కుంట్ల రాములు, కుంట్ల సంగయ్య, అంజిరెడ్డి , విట్టల్, శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలోని రైతు వేదిక అవరణలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకలవ్య ఫౌండేషన్ మండల అధ్యక్షుడు బద్దం బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం, జీవ రసాయనంపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు రవి కుమార్, శ్రీకాంత్, ఉదయ్‌లు అవగాహన కల్పించారు. రాబోవు తరాలకు స్వచ్ఛమైన ఆహారం అందించాలంటే సేంద్రియ వ్యవసాయం ఎంతగానో ఉపయోగపడుతుందని, సేంద్రియ ఎరువుల వల్ల భూమి సాంద్రత పెరుగుతుందని, వ్యవసాయ అధికారులను సంప్రదించి, మేలిమి రకమైన రకాలను ఎంచుకొని పంటలు పండించుకోవాలని రైతులకు వారు సూచించారు

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులతో కమిటీ సభ్యులు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



సిద్దిపేట పట్టణ నాసర్ పుర ముదిరాజ్ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నూతన అధ్యక్షులు బైరి యాదగిరి తెలిపారు. నూతన అధ్యక్షులుగా బైరి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కండ్లకోయ బాలకృష్ణ, బోడ్డు సునీల్, కోశాధికారిగా చిన్న లింగం, ఉపాధ్యక్షులుగా భూమయ్య, సుధాకర్, దేవేందర్, స్వామి, మల్లికార్జున్, సహాయ కార్యదర్శులుగా నాంపల్లి, చింటూ, భగవాన్, రాహుల్, మనోహర్, ప్రచార కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా శివ, నాగరాజు, దయాకర్, రాజు, శ్రీనివాస్, తిరుపతి, రాజేశం, చందు, సురేష్, రాజేష్, శ్రీనివాస్ ల తో పాటు గౌరవ అధ్యక్షులుగా జంగిటి కనకరాజు, లక్ష్మణ్, బోనాల నరసింహులు, రవీందర్, నర్ర రవిలతోపాటు గౌరవ సలహాదారులుగా యాదగిరి, నారాయణ, నర్సింలు, వెంకటస్వామి, కనకయ్య మహేష్, శేఖర్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బైరి యాదగిరి మాట్లాడుతూ ముదిరాజ్ సంఘ అభివృద్ధి కోసం భవిష్యత్తులో పాటుపడతానన్నారు తనపై నమ్మకం ఉంచి కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్దమ్మ దేవాలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యార్థులకు యూనిఫాం పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-ములుగు



మండలంలోని కొక్కొండ, సింగన్నగూడ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పెద్ద బాల్ లావణ్య అంజన్ గౌడ్, కొక్కొండ హెచ్ఎం , సింగన్న గూడా హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ
సిద్దిపేట
4
గురువారం | 13 జూన్ 2024 | www.navatelangana.com

నిధులను దుర్వినియోగం చేస్తున్న హెచ్ఎంపైన చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఉన్న మండల పరిషత్ స్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు పాఠశాల నిధులను దుర్వినియోగం చేస్తుందని, ఆమెపైన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్కూలు నిధులను హెచ్ఎం పద్మ నిధుల దుర్వినిగానికి పాల్పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వివరాలు తెలుసుకోవడానికి పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు. తోటి ఉపాధ్యాయులు కూడా నిధుల ఖర్చుపై అడిగినా వివరాలు ఇవ్వడంలేదని, రశీదులు లేకుండానే ఖర్చు పెట్టారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు అడిగినా ఆమె రసీదులు లేకుండా ఖర్చు చేసినట్లు చెబుతున్నారని, ఈమెపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎర్రోళ్ల శ్యామ్, యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, జిల్లా నాయకులు నారోజు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు అనిల్ గౌడ్, నాయకులు జగన్ మోహన్ రెడ్డి, ఆర్ ఐ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ముగిసిన సర్టిఫికేట్‌ల పరిశీలన



నవతెలంగాణ-నంగునూరు

ఈసెట్ ఆన్లైన్ స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి బుధవారం రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికేట్‌ల పరిశీలన ముగిసినట్లు ప్రిన్సిపల్ సూర్యనారాయణ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తి చేసి నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మొదటి రోజు 205, రెండో రోజు 176, మూడో రోజు 82 మంది సర్టిఫికేట్‌లను పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. ధృవపత్రాల పరిశీలన అనంతరం లాగిన్, ఐడీ అందజేస్తామని, ఆప్షన్లు పెట్టుకున్న వారికి 18న సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలల కార్యక్రమంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ కూర రాఘోత్తం రెడ్డి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థినిలకు దిశా నిర్దేశం చేసి, విద్యార్థులు గొప్పగా ఎదగాలని తెలిపినారు. ఈ సందర్భంగా పాఠశాలకు మైక్ సెట్‌ను డొనేట్ చేసి, ఆర్వో వాటర్ ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. తన ఉపాధ్యాయ జీవితాన్ని గుర్తు చేస్తున్నారు. అనంతరం విద్యార్థులకు బట్టలను, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యాదవ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పాఠశాలలు

- మొదటిరోజు అంతంత మాత్రమే హాజరు
- సెలవుల్లో మండల విద్యాధికారి

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. బడులు తెరిచిన రోజు ఏకరూప దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ చేస్తామనే మాటలు అన్నీ పాఠశాలల్లో అమలు కాలేదని తెలిసింది. నంగునూరు మండలానికి పూర్తి స్థాయి పాఠ్యపుస్తకాలు రానట్లు తెలిసింది. రెండో తరగతి తెలుగు పుస్తకాలు, ఎనిమిదో తరగతి ఆంగ్లం పుస్తకాలు పూర్తిగా రానట్లు ఉపాధ్యాయులు తెలిపారు. నంగునూరు మండల విద్యాశాఖాధికారి సెలవుల్లో ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ కొరవడింది. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉండి వెక్కిరిస్తున్నాయి. ఇంచార్జి బాధ్యతలను ఇతర మండలాల విద్యాధికారికి అప్పగించి నప్పటికీ పని భారంతో చుట్టపు చూపుగా రావాల్సిన పరిస్థితి నెలకొంది. బడులు పునః ప్రారంభం రోజున బస్సులు లేకపోవడంతో పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు ఇంటికే పరిమితమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. మండలంలో సమయానికి బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకూ చెందిన విద్యార్థులు మొదటి రోజు హాజరు కాలేదు. మన ఊరు మన బడిలో చేపట్టిన పనులు పాఠశాలలు ప్రారంభించడానికి ముందే తయారవుతాయనే మాటలు ఎక్కడ అమలు కాలేదు. గతంలో పది ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాలను విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. ఈ సారి కూడా ఎన్ని పాఠశాలలు మూత పడుతాయే వేచి చూడాల్సిందే. మూసిన పాఠశాలల ఉపాధ్యాయులను నంగునూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. దీంతో ఉపాధ్యాయుల కొరత కొంత మేరకు తీరింది. నంగునూరు మండలంలో మొదటి రోజు 30 శాతం విద్యార్థులు హాజరైనట్లు సీఆర్పీలు వెల్లడించారు.

14న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం ఈ నెల 14వ తేదిన 11.00 గం.లకు నిర్వహించనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. సంబంధిత అధికారులు తమ శాఖలకు పూర్తి వివరాల నివేదికను ఈ నెల 13 లోగా 25 సెట్లు ఎంపీడీవో కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు.

ఉపాధి పనులపై 15న ఓపెన్ ఫోరం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఈ నెల 15న ఎన్ఆర్ఈజీఎస్ 2023-2024 సంవత్సరంలో మండల స్థాయిలో సామాజిక తనిఖీలో భాగంగా ఓపెన్ ఫోరం కార్యక్రమం చేపట్టనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన అధికారులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అహ్మదిపూర్ పాఠశాలలో యూనిఫామ్‌ల పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పునః ప్రారంభం మొదటి రోజున ప్రధాన ఉపాధ్యాయుడు సుగుణాకర్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు సుగుణాకర్ మాట్లాడుతూ 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అన్నింట్లో రాణిస్తారని, అన్ని వసతులు ప్రభుత్వ బడుల్లో వుంటాయన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో మౌలిక సౌకర్యాలు మెరుగు పడుతున్నాయన్నారు. గత వారం రోజుల నుండి బడి బాట కార్యక్రమంలో వివిధ గ్రామాలలో తిరుగుతూ పాఠశాల ఫలితాలను తెలియజేశామన్నారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా 2 జతల దుస్తువులు, మధ్యాహ్న భోజనము,ఉచిత పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని ఈ సౌకర్యాలను తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లలను బడికి పంపాలని తెలిపారు. గత సంవత్సరం ఫలితాలలో పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించామన్నారు. మండలంలోనే గత సంవత్సరంలో అహ్మదిపూర్ విద్యార్థిని హాసిని పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్య వద్దు... ప్రభుత్వ బడులే ముద్దు

- బీడీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రైవేటు స్కూళ్లలో విద్య వద్దు ప్రభుత్వ బడులకు వెళ్లడమే ముద్దు అని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. బుధవారం గజ్వేల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్లో వద్దు... ప్రభుత్వ బడులే ముద్దు అన్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు స్కూళ్ళ కు మించిన బోధన అన్ని రకాలుగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో సంవత్సరానికి 50-60 వేలపై బడి విద్య కోసం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ స్కూల్లో ఉచితంగా నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. ఒకటవ తరగతి నుంచి 10 తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంతో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంప్యూటర్ శిక్షణ నైపుణ్యం కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా అనేక సదుపాయాలు ప్రభుత్వ బడుడుల్లో ఉన్నాయన్నారు. అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించి తిప్పలు పడవద్దన్నారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మనం ఎంచుకున్న లక్ష్యమే ముందుకు తీసుకెళ్తుంది

- జిల్లా కలెక్టర్ మను చౌదరి





నవతెలంగాణ-కొండపాక

మనం ఎంచుకున్న లక్ష్యమే జీవితంలో మనల్ని ముందుకు తీసుకెళుతుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. బుధవారం రోజున మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, పాఠశాల పునఃప్రారంభం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, పాఠ్య, నోట్ బుక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ మడిబాట కార్యక్రమం ద్వారా దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రైవేటు పాఠశాలలు, ఇతర పాఠశాలలో చదువుతున్న 66 మంది విద్యార్థులను చేర్పించినందుకు, 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా వ్యాప్తంగా 814 ప్రభుత్వ స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యుదీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదులు, కిచన్ షెడ్ల మరమ్మత్తు, త్రాగునీరు వసతి ఏర్పాటు తదితర పనులను 35 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని మరో వారం, పదిహేను రోజులలో పనులు పూర్తవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డీఎస్సీ ద్వారా ఉద్యోగాన్ని సాధించిన అత్యున్నత అర్హతలు గల ఉపాధ్యాయుల విద్యా బోధన చేస్తారని అలాగే ఉచితంగా రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. తాను కూడా మంచిర్యాల జిల్లాలోని దేవపూర్ అనే మారుమూల గ్రామంలో చదువుకున్నానని క్రమశిక్షణ శ్రద్ధతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన విధంగా చదువుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు చదువుతోపాటు కో కరీక్యులర్ యాక్టివిటీస్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు ఏదైనా సాధించగలమనే మానసిక దృఢత్వాన్ని పాఠశాల స్థాయి నుండే కల్పించాలన్నారు. బాల బాలికలు తేడా లేకుండా అందర్నీ చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ విద్యా సంవత్సరం కూడా పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిపిఓ దేవకీదేవి, ఎంఈఓ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయు లు యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణం ఐటీసీలో ఉన్న పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వల్ల వృద్ధులకు మహిళలకు ఇతరులకు ఇబ్బందులు జరుగుతున్నాయని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. పోస్ట్ ఆఫీస్‌ను గజ్వేల్ పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న భవనానికి మార్చాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. పోస్ట్ ఆఫీస్ వల్ల ప్రజలకు దూర భారం అవుతుందని, ఈ ఆఫీసు ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు గజ్వేల్ పాత పట్టణంలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అదేవిధంగా పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోతున్నట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతున్నందున మరో పోలీస్ స్టేషన్ అవసరమని ఉన్నత అధికారులకు ఇప్పటికే నివేదిక అందించామన్నారు. గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు ఆర్ అండ్ ఆర్ కాలనీ ఉండడం వల్ల పరిపాలన మూలంగా అధికారులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోకి మరో రెండు పోలీస్ స్టేషన్లు అవసరం ఉంటుందని ఆయన చెప్పారు. మల్లన్న సాగర్‌కు సంబంధించిన ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది గజ్వేల్ పట్టణానికి మరో పోలీస్ స్టేషన్ అవసరం ఉంటుందని ఆయన చెప్పారు. అదేవిధంగా బస్టాండ్ స్థల పరిశీలన కూడా మరోసారి చేసి మార్కెట్ శాఖ అధికారులతో చర్చించామని ఆయన చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వెంట పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, నాయకులు మామిడి కృష్ణ, వహీద్ తదితరులు ఉన్నారు



పేదరికాన్ని, అజ్ఞానాన్ని రూపు మాపాలంటే చదువే ఆయుధం

- డిఆర్డీవో జయదేవ్ ఆర్య





నవతెలంగాణ-మర్కుక్

తరతరాల పేదరికాన్ని, అజ్ఞానాన్ని రూపు మాపాలంటే జ్ఞానం అనే చదువు ఒక్కటే ఆయుధమని డిఆర్డీవో జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తాకాలు, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 60,206, మర్కుక్ మండలంలో 2,209 యూనిఫాంలను అందజేశామన్నారు. ప్రజల భాగస్వామ్యం, ఉపాధ్యాయుల కృషి, స్థానిక ప్రజా ప్రతినిధుల, యువత సహకారం, విద్యార్థుల పట్టుదల పాఠశాల అభివృద్ధి, అదర్శ పాఠశాలగా నిలవడానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదవులో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు మూస పద్దతిలో కాకుండా మంచి సృజనాత్మకతతో పనిచేయాలన్నారు. పాఠశాలలు పున:ప్రారంభం రోజున్నే ఏకకాలంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను మండల మహిసమాఖ్య ఆధ్వర్యంలో సకాలంలో అందజేయడంపై వారి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్, ఎంపిటీసి గోలి నరేందర్, ఐకెపి ఎపిఎం బ్రహ్మచారి, సిసి కవిత, పంచాయతీ కార్యదర్శి నీలిమా, వివోఏ దివ్య, కార్యదర్శి వరలక్ష్మి, మహిళ కుట్టు కేంద్రం సభ్యులు సునీత, కవిత, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి కనకయ్య, ఉపాధ్యాయులు ఓంకార్ రాధ కృష్ణ, రామకృష్ణ రెడ్డి, హారిక, వివిలు చిన్ని కృష్ణ, నవీన, నాయకులు బాల్ రెడ్డి, రాముగౌడ్, తదితరులున్నారు. మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పిజి హెచ్ఎం వెంకటేష్, రాణీ, అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాపోల్ల మౌనిక, ఎంపిటీసి సాయిరెడ్డి చైతన్య శంకర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌లు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, రమణారావు, సిద్దయ్య వందన, భ్రమరాంబ, నాగేశ్వరరావు, పద్మారెడ్డి, రమేష్, ప్రసాద్, భుజాత, గణేష్, కృష్ణ, సిఆర్పీ నాయక్, పాపోల్ల బాబు, విద్యార్థులు, తదితరులున్నారు.

బడీడు పిల్లలు బడికి వెళ్లే బాధ్యత అధికారులదే

- ప్రజ్ఞాపూర్ స్కూల్‌లో బడి బాట
- పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

బడీడు పిల్లలు ప్రభుత్వ బడులకు వచ్చే విధంగా టీచర్స్, అధికారులు బాధ్యత తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ మీడియం నందు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని బడిబాట సమావేశాన్ని ఎం ఈఓ సునీత, ప్రిన్సిపాల్ కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు నస్రిన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బడి వయస్సు పిల్లలందరు బడిలో ఉండేవిధంగా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడానికి శిక్షణపొందిన నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉంటారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉచితంగా 2 జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సౌకర్యాలను తల్లిదండ్రులు ఉపయోగించుకొని, పిల్లలను బడికి పంపాలని తెలిపారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జరిగే పనులను త్వరగా పూర్తి చేయుంచుకోవాలని ఎచ్ఎంలకు తెలిపారు. పాఠశాలలకు కావలసిన పుస్తకాలు ఎంఆర్‌సిలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ఏకరూప దుస్తువులను కూడా పాఠశాలలకు అందించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలోని పాఠశాలలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పాఠశాల పునఃప్రారంభం రోజున బుక్స్, యూని పామ్స్ విద్యార్థులకు అందించామని తెలిపారు. పాఠశాల పునః ప్రారంభం రోజున బడిలో పండుగ వాతావరణం ఉండేలా ఎచ్ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్. సి రాజమౌళి, వైస్ చైర్మన్ జక్కి ఉద్దీన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గోన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో పాఠశాలలకు పూర్వ వైభవం

- మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తేవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మోడల్ స్కూల్ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు నోట్ బుక్కులు దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, అదేవిధంగా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నారోజు శ్రీనివాస్, ఎంపీటీసీ బొప్ప కనకమ్మ నాగయ్య, ప్రిన్సిపల్ వెంకన్న, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీశైలం, ఏపీఎం బాబురావు, సిసి ప్రేమలత, ఉపాధ్యాయులు సిఏలు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

ఎంపీగా గెలిపించిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు

- ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

మెదక్ ఎంపీగా గెలిపించిన ప్రతిఒక్కరికి ఎంపీ రఘునందన్ రావు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. మెదక్ ఎంపీగా రఘునందన్ రావు గెలిచిన అనంతరం బుధవారం తొలిసారి సిద్దిపేట పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నియోజక వర్గ ప్రజలు చూపిన అభిమానానికి జీవితకాలం రుణపడి ఉంటానన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో మూడో సారి కేంద్ర ప్రభుత్వం కొలువు దీరిందన్నారు. తెలంగాణ ఉద్యమ కారుడిగా, ఈ గడ్డ బిడ్డగా మెదక్ పార్లమెంట్ అభివృద్ధి కోసం పనిచేస్తా అన్నారు. మెదక్ పార్లమెంట్ కీర్తి పెంచే విధంగా పార్లమెంట్‌లో పేద ప్రజల గళం వినిపిస్తానన్నారు. ఎన్డీఏ భాగస్వామ్యాల పక్షాల కూటమి ఆంధ్రప్రదేశ్ నూతన సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్ర బాబు నాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని 22 రాష్ట్రాల్లో ఎన్డీఏ, భాగస్వామ్య పక్షాలను ప్రజలు ఆశీర్వదించారన్నారు. 6 రాష్ట్రాలు మినహా 22 రాష్ట్రాల్లో ఎన్డీఏ, భాగస్వామ్య పక్షాల నాయకులే సీఎంలుగా ఉన్నారన్నారు. అంతకుముందు శరభేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, విద్యాసాగర్, బాసంగారి వెంకన్న, కొత్తపల్లి వేణుగోపాల్, తొడుపునూరి వెంకటేశం, వెంకట్, కోడూరి నరేష్, కాసుగొట్టు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పిద్దాం

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం గజ్వేల్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో బడిబట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులకు టాటా చెప్పుతూ పాఠశాల కడపతొక్కుతున్న విద్యార్థలకు సమస్యలు ఎదురవ్వొద్దని ప్రభుత్వాన్ని కొరారు. జిల్లాలో 638 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలలో 85,291 మంది విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థులందరికి ఎకరూప దుస్తువులు, పాఠ్య,రాత పుస్తకాలు సకాలంలో ఇచ్చి మధ్యాహ్న బోజనం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధికి 1018 పాఠశాలకుగాను 814 పాఠశాలలను గుర్తించి వీటి అభివృద్ధి కోసం 3480 కోట్లు కేటాయించినప్పటికి 8.40 కోట్లు మాత్రమే విడుదల చేసి కేవలం 375 పాఠశాలలు మాత్రమే కనీస సౌకర్యాలు తీర్చగలిగారన్నారు. మిగతా పాఠశాలల అభివృద్ధిని మరిచిపోకుండా పాఠశాలలో త్వరితగతిన అమ్మ ఆదర్శ కమిటిల ద్వారా పరిష్కరించి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా చేయాలని ప్రభుత్వాన్ని కొరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డిబిఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి





నవతెలంగాణ-నంగునూరు

పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత నోట్, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని తెలియజేశారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన స్థానంలో నిలిచి పాఠశాలలకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాలల్లో పరిసరాల పరిశు భ్రత, పారిశుధ్య కోసం స్కావెంజర్లను నియమించాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందని పేర్కొన్నారు. జూలైలో స్కావెంజర్లను నియమించే అవకాశం ఉందని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి. రవీంద్రారెడ్డి,పీఆర్టీయూ నాయకులు ఎర్ర పార్థసారథి, పంతం నరేష్, కొత్తపల్లి రవి, ఉపాధ్యాయులు, సిఆర్పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబాలకు అండదండలు

సీపీ. డాక్టర్ బి.అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



విధినిర్వహణలో మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు డిపార్ట్మెంట్ ఎప్పుడు అండగా ఉంటుందని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. బుధవారం సీపీ ఆఫీస్‌లో గత కొన్ని రోజుల క్రితం హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కుటుంబ సభ్యులకు పోలీస్ డిపార్ట్మెంట్ తరఫున అందవలసిన బెనిఫిట్స్ లో భాగంగా పోలీస్ భద్రత నుండి వచ్చిన 8 లక్షల చెక్కును అందజేసారు. తిరుపతి కుటుంబ సభ్యులకు రావలసిన మరికొన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ జమీల్ అలీ, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు... ఆదుకుంటా..

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ యూత్ సోషల్ మీడియా కన్వీనర్ పంది శ్రావణ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు వారి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రావణ్ బీఆర్ఎస్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు డప్పు బాబు తండ్రి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడద్దని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటారని భరోసా ఇచ్చారు. వీరి వెంట ఆత్మ కమిటీ చైర్మన్ లక్కర్స్ ప్రభాకర్ వర్మ, మాజీ సర్పంచ్ ఏర్వ రమేష్ సీనియర్ నాయకులు రామచంద్రరావు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

నవ తెలంగాణ-రాయపోల్



దౌల్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం పాఠశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటికి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రాధిక అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం పాఠశాలలో డే వాచ్ ఉమెన్ (01)మరియు స్కావెంజర్(01) మొత్తం మూడు(02) పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలపడం జరిగింది. ఆసక్తి ఉన్న మహిళలు ఇట్టి పోస్టులకు దౌల్తాబాద్ కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోగలరని ఆమె తెలిపారు.

ఇసుకను వేలం వేసిన అధికారులు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల పరిధిలోని కమలాయపల్లి గ్రామ శివారులో ఇటీవల అక్రమంగా నిల్వచేసిన 15 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గుత్తి వెంకటయ్య వేలం పాటలో పాల్గొని రూ.56 వేలకు ఇసుకను స్వాధీనం చేసుకున్నట్టు రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం ..!

బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్



బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని, బాలల చదువు భవితి కి వెలుగు అని నినాదంతో ముందుకు పోదామని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ అన్నారు.బుధవారం హుస్నాబాద్ పట్టణంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ నేత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులే నవనిర్మాణ వ్యక్తులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని కోరారు .

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య



నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయులు రామ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలం లోని పెద్ద మాసాన్ పల్లి వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠ శాల విద్యార్థులకు ఏకరూప దుస్తువులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మెరుగైన వైద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించి నాణ్యమైన విద్య అందేలా చూడాలని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థుల తల్లులు మమత, మల్లవ్వ, స్వరూప, చంద్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రాయపోల్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు కుటుంబానికి అండగా నిలవాలని ఆర్థిక సహాయం చేయడం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఉప్పర పల్లి గ్రామానికి చెందిన బెస్త అజయ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మతి చెందడం చాలా బాధాకరమని, చిన్న వయసులోనే తిరిగిరాని లోకాలకు వెళ్లి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. యుక్తవయసులోకి వచ్చిన పిల్లలు మరణిస్తే తల్లిదండ్రుల బాధ వర్ణనాహితం. అజయ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. మరణించిన వారిని తిరిగి తీసుకురాలేమని మనోధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. వారి కుటుంబానికి అండగా నిలవాలని ఉద్దేశంతో రూ. 10 వేల నగదు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి తాజా మాజీ సర్పంచ్ చిత్తారి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పబ్బ అశోక్, నాగరాజు గౌడ్, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహించవద్దు



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించవద్దని,ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చేర్యాల ఎస్ఐ దామోదర్ అన్నారు. మండలం లోని చిట్యాల గ్రామం లో బెల్ట్ షాపులు తొలగించాలని మహిళలు చేస్తున్న ఆందోళనకు స్పందించిన ఎస్ఐ దామోదర్, ఎక్సైజ్ ఎస్ఐ సురేష్ తో కలిసి బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళల ను పిలిపించి ఇకపై గ్రామంలో బెల్ట్ షాపులు ఉండవని భరోసా కల్పించారు. గ్రామాలలో జూదం ,గంజాయి బెల్ట్ షాపులు వంటి వాటిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.

హైనాతో రైతుల్లో భయాందోళన

- గత నెల వ్యవధిలో పలు ఘటనలు
- దాదాపు 100 జీవులు మృతి
- హైనాను బంధించడానికి అటవీ శాఖ చర్యలు



నవతెలంగాణ-చిన్నకోడూరు

హైనా.. హైనా.. హైనా... గత కొద్ది రోజులుగా మండలం లోని రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు భయంతో వణికిపోతున్నారు. ఎంతలా అంటే రాత్రి వేళల్లో వ్యవసాయ పొలం వద్ద కొట్టాలలో సేదతీరుతున్న సమయంలో హైనా దాడులతో భయంతో వణికిపోతున్నారు. తమ జీవనాధారం అయిన జీవాలు కళ్ళముందు మృత్యువాత పడుతుండటంతో బాధిత రైతులు తీవ్ర మనోవేదనకు గురౌతున్నారు. హైనాను బంధించాలని సీసీ కెమెరాలు, బోన్ లాంటి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. హైనా వేరు ప్రాంతాల్లో దాడికి పాల్పడటం వలన అధికారులు ఏర్పాట్లు చేసిన బోన్‌లో చిక్కడం లేదు. ఇంకెన్నాళ్ళు హైనా తో తమ పెంపుడు జీవులకు ఈ జీవన్మరణ సమస్యలు అని బెంబేలెత్తుతున్నారు రైతులు. చిన్నకోడూరు మండలంలో హైనా కలకలం అంతా ఇంతా కాదు. రైతులు తమ ఆవులు, ఎడ్లు, గేదెలు, దూడలు ముఖ్యంగా గొర్రెలు మేకలను రక్షించుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామ శివారులోని పున్నం మల్లయ్య తన వ్యవసాయ పొలం వద్ద రోజు మాదిరిగానే మే22న సాయంత్రం గొర్రెలను జీవాల మంద కోసం ఏర్పాటు చేసిన ఇనుప జాలీల ఫెన్సింగ్ లో భద్రంగా వదిలి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి హైనా దాడి చేయడంతో ఏకంగా 65గొర్రెలు మతి చెందగా మరో 20 గొర్రెల తీవ్రంగా గాయపడ్డాయి. గత నెల రోజులుగా మాచాపూర్ గ్రామంలో హైనా దాడులు జరగడం మూగ జీవాలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతూనే ఉంది. జూన్ 12న మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామ శివారులో రైతు బాలలింగం వెంకటయ్య వ్యవసాయ బావి వద్ద హైనా దాడి చేయడంతో 2మేకలు మతి చెందగా లేగ దూడ తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మాచాపూర్ గ్రామానికి చెందిన కర్రె తిరుపతి బావి వద్ద హైనా దాడి చేయడంతో లేగ దూడ మతి చెందింది.

హైనాను బంధించడానికి కృషి

బుచ్చయ్య, సెక్షన్ అధికారి, అటవీ శాఖ

హైనాను బంధించడానికి బోన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసాం. హైనా ఒక్కటే సంచరిస్తున్నదని ఒకే ప్రాంతంలో కాకుండా దూర ప్రాంతాల్లో దాడి చేయడంతో బోన్ లో చిక్కడం లేదు. ఘటనలపై ప్రభుత్వానికి రిపోర్ట్ అందించి బాధిత రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

చదువులో నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతంగా ఎదగాలి

ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట రూరల్



చదువులో నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన 2024 -25 విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకల్లో విద్యార్థులకు పుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ

ప్రభుత్వం మొదటి రోజునే పుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేయడం చాలా సంతోషకరమని అన్నారు. విద్యార్థులు ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.చదువులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. సమాజంలో విద్యార్థి ఒక శక్తిగా ఎదగాలని లక్ష్యం, ప్రణాళికక్రమతో కషి చేయాలని అన్నారు.

చరిత్రను చదవడం కాదు, ఒక విద్యార్థిగా చరిత్రను కూడా సష్టించుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు తమ వత్తిని నమ్ముతూ జాతికి పునరంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-మిరుదొడ్డి



రాత్రి సమయంలో వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాల్టా చట్టానికి ఇసుక మాఫియా తూట్లు పొడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని నాగయ్య వాగు నుండి ఇసుకను యధేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఒకచోట డంపు చేసి డబ్బులు దండుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ట్రిప్పుకు సుమారు 6000 నుండి 7000 రూపాయల వరకు ఇసుకాసురులు వసూలు చేస్తున్నారు. పేదోడు ఇంటి నిర్మాణం లేదా మరుగుదొడ్ల నిర్మాణానికి ఇసుక కావాలంటే అధికారుల అనుమతి లేకుండా వెళ్తే వెంటనే ట్రాక్టర్లను సీజ్ చేసే పోలీస్, రెవెన్యూ అధికారులు ఇసుక మాఫియా యదేచ్ఛగా రాత్రుల్లో ఇసుకను తరలిస్తే పట్టించుకోకపోవడం పై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా డంపు చేసిన విషయాన్ని టాస్క్ ఫోర్స్ అధికారుల దృష్టికి మీడియా ద్వారా తీసుకు వెళ్ళడంతో అధికారులు స్పందించారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను పరిశీలించి సీజ్ చేశారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలించిన, నిల్వచేసిన తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

తహశీల్దారు గోవర్ధన్

నవతెలంగాణ-మిరుదొడ్డి



విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు ప్రభుత్వ పాఠశాలలో కల్పించడం జరుగుతుందని తహసిల్దార్ గోవర్ధన్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల మండల స్థాయి అధికారులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పాఠశాల ప్రారంభం రోజు నాడే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను అందించడం హర్షనీయమన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కషి చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాల మోజులో పడి విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీతో పాటు ఏకరుప దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి ,ఎంఈఓ ప్రభుదాస్, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్రామలింగం, ఎస్సై పరశురాములు పలువురు పాల్గొన్నారు.

అందరి కృషితో మారిన మండలం రూపురేఖలు

ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్





అందరి కృషితో మండలం రూపురేఖలు మారాయని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ తెలిపారు. బుధవారం నారాయణరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముందుగా అధికారులు వారు సాధించిన ప్రగతి నివేదికను సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అయిందని రైతులకు పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు . విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాలలు పున ప్రారంభం కావడంతో మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ నోట్ బుక్స్ అన్ని పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకున్నామని పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో కొత్త మండలం ఏర్పాటు చేసుకొని అధికారులు ,నాయకుల సమన్వయంతో మండలం రూపురేఖలు మారాయి అన్నారు. అభివృద్ధి పథంగా మండలాన్ని ముందుకు తీసుకెళ్లి ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులకు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, వైస్ ఎంపీపీ సంతోష్ కుమార్, ఎంపీటీసీలు, ఆకుల హరీష్ ,స్వప్న ప్రభాకర్ ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివినా అన్నిట్లో రాణిస్తారు

నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అన్నిట్లో రాణిస్తారని మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం మండ లంలోని చందాపూర్ ప్రభుత్వ పాఠ శాలలో 2024-25 విద్యా సంవత్సరాన్ని ప్రారం భిస్తు తెలంగాణ ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్త కాలు, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులను పాఠశాల అమ్మా ఆద ర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీ, ప్రధానోపా ధ్యాయులు గరిపల్లి సిద్ధేశ్వర్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ రాజుతో కలిసి విద్యార్థులకు అంద జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవ త్సరం పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు సకా లంలో అందించారని అన్నారు. చందాపూర్ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో, ఉపన్యాసాల్లో రాణిస్తున్నారని, ప్రతి ఒక విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా నిలబడు తారని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల సహోపాధ్యాయులు రాంబాబు, అరుణ, గంగా, సతీష్ కుమార్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక గ్రామపంచాయితీలపై భారం



నవతెలంగాణ-వర్గల్

గతకొద్ది రోజులుగా గ్రామపంచాయితీలకు ఎలాంటి నిధులు రావడంలేదని, రాష్ట్ర, కేంద్ర, ఆర్థిక సంఘ నిధులు జమకాకపోవడంతో గ్రామపంచాయితీల నిర్వహణ తలకు మించిన భారంగా మారుతుందని గ్రామ పంచాయితీ కార్యదర్శులు అన్నారు. జీపీల నిర్వహణ భారంగా మారిందని ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఖలీమ్ లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యదర్శులు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా ఎలాంటి నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు, విద్యుత్ దీపాలు నిర్వహణకు, ట్రాక్టర్, ఇతర మరమ్మతులకు, ఇతర అత్యవసర నిర్వహణలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 20 గ్రామాలలో గత 5 నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదని అన్నారు. గ్రామాలలో మౌలిక సౌకర్యాలకు తమ చేతినుండి డబ్బులు పెట్టడం భారంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో 27 గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు శిక్షణ



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలంలోని తీగల్ గ్రామంలో ఆయిల్ పామ్ రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో మండల వ్యవసాయ అధికారి యు.వసంతరావు పాల్గొని ఆయిల్ పామ్ రైతులకు సూచనలు చేశారు. ఆయిల్ పామ్ మొక్కలకు వయస్సు ను బట్టి తగిన మోతాదులో నీరు మరియు పోషకాలు (ఎరువులు) లను అందించాలని తెలిపారు. నాటిన సంవత్సరం తర్వాత వచ్చే గెలలను తీసివేయాలని దీనికి అబ్లేషన్ టూల్ అనే పరికరం ద్వారా సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. నాటిన 36 నెలల తర్వాత వచ్చే గెలల ను వదిలి అవి నలుపు రంగు నుండి నారింజ రంగులోకి మారినప్పుడు గెలలను కోసి ఫ్యాక్టరీకి తరలించాలని తెలిపారు. మండలంలో 560 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేశారని ఇంకా ఎక్కువ మొత్తంలో రైతులు ముందుకు వచ్చి ఈ పంటను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, భాను ప్రకాష్, కిరణ్ మరియు రైతులు బట్టు సుధాకర్ రెడ్డి, గంగ్ర రాములు, బబ్బూరి రాములు, సందిరి మధు, వలబోజు వెంకటేశ్వర చారి , నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రారంభం రోజే పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్స్ ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని మండల విద్యాధికారి బండి నరసవ్వ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నటువంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని మండల విద్యాధికారి అన్నారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో అన్ని సౌకర్యాల పనులు పూర్తవుతున్నాయని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలస్వామి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషయ్య, ఉపాధ్యాయులు రాజయ్య, కవిత, వసంత, లక్ష్మి, మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సిఆర్పిలు రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

